Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org

# అమెరికా ఆంక్షలకు అంగీకారం!

ఇరాన్ నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేయనున్న భారత్

ప్రత్యామ్నాయాల అన్వేషణ

పెట్రో ధరలు పెరిగే అవకాశం

దిల్లీ




ఇరాన్ నుంచి ముడి చమురును దిగుమతి చేసుకోవద్దంటూ అమెరికా విధించిన ఆంక్షలకు భారత్ సమ్మతించినట్టే కనిపిస్తోంది. అదే సమయంలో ఇంధన కొరత లేకుండా చూడడానికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. ఇరాన్ ఆదాయ వనరులను దెబ్బతీయాలన్న లక్ష్యంలో భాగంగా ఆ దేశం నుంచి చమురు కొనుగోళ్లు చేయకూడదని, లేకుంటే ఆంక్షలు తప్పవని అమెరికా వివిధ దేశాలకు స్పష్టం చేసింది. దీనిపై విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రవీష్ కుమార్ మాట్లాడుతూ అమెరికా చేసిన ప్రకటనను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకొందని తెలిపారు. ఈ ప్రభావాన్ని ఎదుర్కోవడానికి అన్ని విధాలుగా సిద్ధంగా ఉందని చెప్పారు. అధికారిక సమాచారం వెల్లడికానప్పటికీ ఇరాన్ నుంచి చమురు కొనుగోళ్లను పూర్తిగా నిలిపివేయడం ఖాయమని విశ్వసనీయ ఉన్నతస్థాయి వర్గాలు తెలిపాయి. "అమెరికా ప్రభుత్వం మినహాయింపులను పునరుద్ధరించే వరకు ఇరాన్ నుంచి చమురు కొనుగోలు చేస్తామని భావించడం లేదు. ఆ దేశం నుంచి చమురు దిగుమతులను నిలిపివేస్తున్నాం" అని ఓ ఉన్నతాధికారి చెప్పారు. ఇరాన్ నుంచి చమురు కొనుగోలు చేయడానికి గతంలో ఇచ్చిన మినహాయింపులను మే రెండోతేదీ తరువాత కూడా కొనసాగించాలని అమెరికాను కోరుతామని తెలిపారు. ఇందుకు సంబంధించిన చర్చలు ఈ నెలాఖరులో జరుగుతాయని అన్నారు.

స్పష్టమైన ప్రణాళిక ఉంది: మంత్రి ప్రధాన్

కేంద్ర ఇంధన శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ వ్యవహారంపై ట్వీట్ చేస్తూ చమురు శుద్ధి కర్మాగారాలకు తగినంతగా ముడిచమురు సరఫరా చేసే విషయమై స్పష్టమైన ప్రణాళిక ఉందని పేర్కొన్నారు. దేశ అవసరాలకు తగ్గట్టుగా ఇతర దేశాల నుంచి అదనంగా తీసుకొస్తామని తెలిపారు. గత కొన్ని నెలలుగా ఈ సమస్యపై ప్రత్యామ్నాయ ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఛైర్మన్ సంజీవ్ సింగ్ చెప్పారు. కాంట్రాక్టుల్లో పేర్కొన్నదానికి మించి దిగుమతి చేసుకొనే

సౌలభ్యం ఉందని అన్నారు. దాంతోపాటుగా ఎప్పటికప్పుడు స్పాట్ మార్కెట్ రూపంలో కొనుగోలు చేసే అవకాశం కూడా ఉందని చెప్పారు. ఉదాహరణకు సౌదీ అరేబియా నుంచి 5.6 మిలియన్ టన్నుల ముడిచమురు కొనుగోలుకు ఒప్పందం ఉండగా, అదనంగా మరో 2 మిలియన్ టన్నులు కొనుగోలు చేయవచ్చని తెలిపారు. ఇతర దేశాలతోనూ ఇలాంటి ఒప్పందాలు ఉన్నాయని వివరించారు. అయితే వీటి కారణంగా ధరలు పెరగవచ్చని అభిప్రాయపడ్డారు. "ఒప్పందాల కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ఎప్పుడంటే అప్పుడు దొరుకుతుంది. అయితే దీని ప్రభావం ధరలపై ఎలా ఉంటుందో చెప్పడం కష్టం" అని అన్నారు.

ధరలు పెరుగుదల ఎలా ఉంటుంది?

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌తో కుదిరిన అణు ఒప్పందాన్ని ఉపసంహరించుకొని, ఆ దేశంపై ఆంక్షలు విధించినప్పుడు ముడిచమురు ధర బ్యారెల్‌కు 85 డాలర్లకు పెరిగింది. అయితే అనూహ్యంగా కొన్ని దేశాల విషయంలో మినహాయింపులు ఇచ్చినప్పుడు 50 డాలర్లకు పడిపోయింది. తాజాగా సోమవారం బ్యారెల్ ధర 74.46 డాలర్లు పలికింది. గత ఆరు నెలల కాలంలో ఇదే అత్యధిక ధర కావడం గమనార్హం.

**ఇది ట్రంప్ చేసిన మెరుపుదాడి**

ఒప్పుకోబోమంటూ ప్రధాని ప్రకటించాలి

కాంగ్రెస్ డిమాండ్

ఈనాడు, దిల్లీ: ఇరాన్ నుంచి ముడి చమురు కొనుగోలు చేయొద్దంటూ ఆంక్షలు విధించడం ద్వారా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత సార్వభౌమాధికారంపై దాడిచేశారని కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేష్ ఆరోపించారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ దీనిపై ప్రధానమంత్రి తక్షణం స్పందించాలని కోరారు. ఈ ఆంక్షలను ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించబోంటూ జాతికి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. దౌత్యనీతిలో మోదీ ఘోరంగా విఫలం అయ్యారనడానికి ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. ఇది సాధారణ దాడి కాదని అమెరికా ప్రభుత్వం చేసిన మెరుపుదాడి అని అన్నారు. నేరుగా భారత్‌ను ఆక్రమించిందని వ్యాఖ్యానించారు. మనం ఎక్కడి నుంచి ముడి చమురు కొనుగోలు చేయాలో నేరుగా అమెరికాయే నిర్ణయించడమేమిటని ప్రశ్నించారు.

చౌక వాణిజ్యం ఇక ఉండనట్టే

నాటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ కృషి ఫలితంగా ముడిచమురు దిగుమతిలో ఇరాన్ ఎన్నో వెసులుబాట్లు కల్పించిందని, ఇతర దేశాలవీ ఆ సౌకర్యాలు ఇవ్వవని జైరాం రమేష్ అన్నారు. "అంతర్జాతీయ మార్కెట్ నుంచి కొనుగోలు చేస్తున్న ముడిచమురులో 10% మొత్తాన్ని భారత్ ఇరాన్ నుంచే దిగుమతి చేసుకుంటోంది. అందుకు డాలర్ల రూపంలో కాకుండా రూపాయల్లో డబ్బు చెల్లిస్తోంది. పైగా రెండు నెలలపాటు అరువు ఇస్తోంది. ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తోంది. ఇతర దేశాలేవీ ఈ వెసులుబాట్లు ఇవ్వవు" అని వివరించారు. ఇరాన్ నుంచి చమురు దిగుమతులు నిలిచిపోతే అక్కడి చాబహార్ నౌకాశ్రయం కోసం భారత్ పెట్టిన రూ.1600 కోట్లు పెట్టుబడి ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

## మే 23 సాయంత్రం నుంచే భారీగా పెరగనున్న ధరలు

ఎన్నికల దృష్ట్యా మే 23 వరకు ధరలు పెంచవద్దని ప్రధాని మోదీ చమురు కంపెనీలను ఆదేశించారని కాంగ్రెస్ ప్రధాన అధికార ప్రతినిధి రణదీప్ సుర్జేవాలా తెలిపారు. మే 23వ తేదీ సాయంత్రం నుంచే లీటరు పెట్రోలు/డీజిల్‌లపై రూ.5 నుంచి రూ.10 వరకు ధరలు పెరుగుతాయని చెప్పారు.

Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org